రేపు బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం

మద్దూరు(ధూళిమిట్ట), జనవరి 16: మద్దూరు మండలకేంద్రంలోని తాజ్‌మహల్ గార్డెన్‌లో శనివారం మద్దూరు, ధూళిమిట్ట మండలాల బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు బీఆర్ఎస్ మద్దూరు, ధూళిమిట్ట మండల శాఖల అధ్యక్షులు మేక సంతోశ్‌కుమార్, మంద యాదగిరి గురువారం ప్రకటనలో తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరు కానున్నట్లు తెలిపారు. సమావేశానికి మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, ముఖ్య కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి

- హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న
- మున్సిపల్ పాలకవర్గ అత్యవసర సమావేశం

మాట్లాడుతున్న ఆకుల రజితావెంకన్న

మున్సిపల్ సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు

హుస్నాబాద్ టౌన్, జనవరి 16: అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో పాలకవర్గ అత్యవసర సమావేశం జరిగింది. సమావేశంలో చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న మాట్లాడుతూ.. ఈనెల 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు జరిగే వార్డు సమావేశాల్లో ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులకు చెందిన లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. సమావేశాల్లో అర్హులైన వారి పేర్ల జాబితా రాలేదన్నారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు అందిచేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆమె సూచించారు. జాబితాలో పేర్లు రానివారు తప్పనిసరిగా మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని చైర్‌పర్సన్ సూచించారు. వార్డు సమావేశాల్లో పేదలను గుర్తించే విషయంలో పక్షపాతం చూపించవద్దని, అర్హులైన వారినే ఎంపిక చేయాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ గౌడ్, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్లు నళినిదేవి, రమాదేవి, భాగ్యారెడ్డి, రవీందర్, హరీశ్, వేణు, రత్నమాల, సుప్రజ, శ్రీనివాస్, రాజు, స్వర్ణలత, శ్రీనివాస్, సరోజన, పద్మ, కోఆప్షన్ సభ్యులు శంకర్‌రెడ్డి, అయూబ్‌తోపాటు వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- బీఆర్ఎస్ తొగుట మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి


మాట్లాడుతున్న జీడిపల్లి రాంరెడ్డి, పార్టీ శ్రేణులు

తొగుట, జనవరి 16: హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ తొగుట మండలాధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి పేర్కొన్నారు. గురువారం పార్టీ శ్రేణులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేసీఆర్ రెండు పంటలకే రైతుబంధు ఇస్తున్నాడని, మూడు పంటలకు ఇవ్వాలని మాట్లాడిన రేవంత్‌రెడ్డి నేడు రైతుబంధుకు మంగళం పాడారన్నారు. యాసంగి సాగు పూర్తయినా ఇంతవరకు రైతుభరోసా వేయలేదన్నారు. ఎన్నికల్లో అందరికీ రైతుభరోసా ఇస్తామని చెప్పి, నేడు కోతలు విధించడం అన్యాయమన్నారు. రైతులతో పాటు కౌలు రైతులు, రైతు కూలీలందరికీ ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలన్నారు. పంట రుణమాఫీలో చిన్న మంది రైతులకు రుణమాఫీలో కోత పెట్టడం సరికాదన్నారు. పంట రుణమాఫీ కాని వారి కోసం ఒక అధికారిని నియమించి వారికి న్యాయం చేయాలని, రూ.రెండు లక్షలకు పైబడి రుణం ఉన్న రైతులకు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల పక్షాన పోరాటం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులపై కక్షపూరిత చర్యలు మానుకొని ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మహ్మద్ జహంగీర్, వెంకటయ్య, బండారు స్వామి, సూతారి రాములు, పర్శరాములు, పాత్కుల స్వామి, బాలేశ్, వడ్డే రామచంద్రం, కత్తుల రమేశ్, పులిగారి గణేశ్, బండారు యాదగౌడ్, నాగులపల్లి శివ, స్వామి తదితర నాయకులు పాల్గొన్నారు.

సమరయోధురాలి కుటుంబానికి పరామర్శ

బైరాన్‌పల్లిలో జంగిటి లచ్చవ్వ కుటుంబాన్ని పరామర్శిస్తున్న అందెశ్రీ

మద్దూరు(ధూళిమిట్ట), జనవరి16: ధూళిమిట్ట మండలంలోని బైరాన్‌పల్లిలో ఇటీవల మృతి చెందిన స్వాతంత్ర్య సమరయోధురాలు జంగిటి లచ్చవ్వ కుటుంబాన్ని ప్రముఖ కవి అందెశ్రీ గురువారం పరామర్శించారు. కుటుంబ సభ్యులతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1948లో రజాకార్లకు వ్యతిరేకంగా బైరాన్‌పల్లిలో బురు జు కేంద్రంగా సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో జంగిటి లచ్చవ్వ చేసిన పోరాటం భావితరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు. ఆయన వెంట గ్రామ పెద్దలు ఉన్నారు.

బస్తీ దవాఖాన ఆకస్మిక తనిఖీ

బస్తీ దవాఖానలో మందులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో పల్వన్‌కుమార్

గజ్వేల్, జనవరి 16: మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డు ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని బస్తీ దవాఖానను డీఎంహెచ్‌వో పల్వన్‌కుమార్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దవాఖానకు వచ్చిన రోగులతో మాట్లాడి అందుతున్న వైద్యసేవలను తెలుసుకున్నారు. దవాఖానలో ఉన్న మందులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరికీ నాణ్యమైన వైద్యసేవలు అందేలా చూడాలని వైద్య సిబ్బందికి సూచించారు. దవాఖానకు రోగులు వచ్చేలా చూడాలని, వైద్యసేవలను పేదలు వినియోగించుకునేలా చూడాలన్నారు. వివిధ రకాల జబ్బులతో వచ్చే వారికి రక్త పరీక్షలు చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, వైద్యులు రేవతి, శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

మల్లన్న ఆలయంలో హుండీల లెక్కింపు

చేర్యాల, జనవరి 16: కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో గురువారం హుండీలను లెక్కించారు. హుండీలను మహా మండపంలో ఆలయ ఈవో రామాంజనేయులు ఆధ్వర్యంలో దేవాదాయ శాఖ మెదక్ జిల్లా ఏసీ చంద్రశేఖర్ పర్యవేక్షణలో పోలీసు బందోబస్తు మధ్య లెక్కించారు. ఆలయంలోని 24 హుండీలను ఆలయ అర్చకులు, ఉద్యోగులు, తాత్కలిక సిబ్బంది, హైదరాబాద్, రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన శివరామ కృష్ణ భవన మండలి సేవాసమితి సభ్యులు లెక్కించారు. లెక్కింపులో రూ. 73,14,488 నగదుతోపాటు, 134 గ్రాముల మిశ్రమ బంగారం, 9 కిలోల 300 గ్రాముల మిశ్రమ వెండి, 1000 కిలోల బియ్యం, 26 నోట్లు ఇతర దేశాల కరెన్సీ వచ్చింది. ఈ సందర్భంగా ఈవో రామాంజనేయులు మాట్లాడుతూ.. ఆలయంలో 24 హుండీల ద్వారా వచ్చిన నగదును స్థానిక తెలంగాణ గ్రామీణ బ్యాంకులో జమ చేశామన్నారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో బుద్ది శ్రీనివాస్, ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, పర్యవేక్షకులు శ్రీరాములు, సురేందర్, పాలక మండలి సభ్యులు, అర్చకులు, ఆలయ సిబ్బంది, ఒగ్గు పూజారులు, తాత్కలిక సిబ్బంది పాల్గొన్నారు.

కూడవెల్లి ఆలయ హుండీ లెక్కింపు

దుబ్బాక, జనవరి 16: దుబ్బాక నియోజకవర్గంలోని అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని కూడవెల్లి రామలింగేశ్వర ఆలయంలో గురువారం హుండీని లెక్కించారు. దేవాదాయ శాఖ సిద్దిపేట డివిజన్ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆలయ హుండీని లెక్కించారు. హుండీ ఆదాయం రూ. 1,27,174 వచ్చినట్లు అధికారులు తెలిపారు. మాఘ అమావాస్య సందర్భంగా ఈనెల 28 నుంచి వారం రోజుల పాటు జాతర నిర్వహిస్తున్నందున ఇందుకు సంబంధించిన పలు ఆదాయ, వ్యయ టెండర్లను నిర్వహించారు. పులిహోరా, లడ్డు ప్రసాదానికి రూ.5.35 లక్షలు ఆదాయం రాగా, నైట్ పెండల్స్ అండ్ బార్కెడ్‌లకు రూ.1.30 లక్షలు, పూల అలంకరణకు రూ.55 వేలు, విద్యుత్ దీపాల అలంకరణకు రూ.40 వేలు, సీసీ కెమెరాలకు రూ.23 వేలు, పారిశుధ్య పనుల నిర్వహణకు రూ.29 వేల టెండర్లను పలువురు దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో విశ్వనాథ శర్మ, అర్చకులు సంకేత్ శర్మ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొండపోచమ్మ జాతరకు బందోబస్తు పరిశీలన

జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏసీపీ పురుషోత్తంరెడ్డి

జగదేవపూర్, జనవరి16: మండలంలోని తీగుల్‌నర్సాపూర్ కొండపోచమ్మ ఆలయ జాతరకు బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించినట్లు గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి తెలిపారు. గురువారం కొండపోచమ్మ ఆలయాన్ని సీఐ మహేందర్‌రెడ్డి, జగదేవపూర్ ఎస్ఐ చంద్రమోహన్‌లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 20 నుంచి ప్రారంభమవుతున్న జాతరలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ముఖ్యంగా పార్కింగ్ ప్రదేశాలు, క్యూలైన్ల ఏర్పాట్లు, శానిటేషన్ ఏర్పాట్లను పరిశీలించారు. ఎక్కడా ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తకుండా బారికేడ్లు ఏర్పాటు చేసి, ఎక్కడికక్కడ వాహనాలు వెళ్లేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని, అధికారులకు, పోలీసులకు సహకరించాలని సూచించారు. అంతకుముందు కొండపోచమ్మ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వారిని ఆలయ అర్చకులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ రజితారమేశ్, ఆలయ అధికారులు మహేందర్‌రెడ్డి, కనకయ్య, సిబ్బంది హరి, చిన్న, అంజయ్య అర్చకులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ, ఇందిరమ్మ భరోసా అమలు చేయాలి

ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నిర్వాసిత గ్రామాల ప్రజలు

గజ్వేల్, జనవరి 16: మల్లన్నసాగర్ భూ నిర్వాసితులకు ఉపాధి హామీ, ఇందిరమ్మ అమృత భరోసా పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం ఆర్డీవో కార్యాలయం ఎదుట డీబీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టి ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ మాట్లాడుతూ.. భూ నిర్వాసితులకు ఉపాధి హామీ పనులు చూపించాలని, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీని అమలు చేయాలని, అన్ని గ్రామాలకు శ్మశాన వాటికలను నిర్మించాలని డిమాండ్ చేశారు. నిర్వాసితులకు 2013 చట్టం ప్రకారం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలు అందని కుటుంబాలకు వెంటనే అందించాలన్నారు. ఎర్రవల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి స్వామికి 91మంది కూలీల సంతకాలతో పని కల్పించాలని దరఖాస్తు సమర్పించారు. జాబ్ కార్డులున్నా పనులు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ అమృత భరోసా పథకం కింద నిర్వాసితులకు రూ. 12వేల ఆర్థికసాయం అందించాలన్నారు. ఉపాధి పథకం కింద నిర్వాసితులైన కూలీలకు జాబ్ కార్డులున్నా ఐదేండ్లుగా పనులు చూపించకపోవడంతో ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. నిర్వాసితుల సమస్యలపై ప్రభుత్వం స్పందించకుంటే త్వరలో కలెక్టరేట్‌ను ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎగొండస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి వేణు పాల్గొన్నారు.

మానవత్వాన్ని చాటుకున్న పోలీసులు

హుస్నాబాద్, జనవరి 16: అనాథలా రోడ్డు పక్కన ఉన్న వృద్ధురాలిని సురక్షితంగా ఇంటికి చేర్చి మానవత్వాన్ని చాటుకున్నారు హుస్నాబాద్ పోలీసులు. పట్టణంలోని గాంధీచౌక్‌లో మూడు రోజులుగా ఉన్న వృద్ధురాలిని చూసి కౌన్సిలర్ రాజు పోలీసులకు సమాచారమిచ్చాడు. హెడ్‌కానిస్టేబుల్ మొగిలినాయక్, కానిస్టేబుల్ దుద్యానాయక్ వివరాలు తెలుసుకున్నారు. హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం బొల్లోనిపల్లికి చెందిన వడ్ల కొండ కొమురవ్వనని, తనకు కొడుకు, కూతుళ్లు ఉన్నారని, కొడుకు ఇటీవల అకారణంగా కొట్టాడనే కోపంతో హుస్నాబాద్‌కు వచ్చానని చెప్పింది. ఆకలిగా ఉందని అడగడంతో భోజనం తినిపించిన సొంతఖర్చులతో ఆటోలో స్వగ్రామానికి పంపారు.

సాగుకు యోగ్యం కాని భూముల పరిశీలన

మద్దూరులో వెంచర్‌ను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారి రాధిక

మద్దూరు(ధూళిమిట్ట), జనవరి 16: కలెక్టర్ ఆదేశాల మేరకు రైతుభరోసా కోసం సాగుకు యోగ్యం కాని భూములను పరిశీలిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాధిక అన్నారు. గురువారం మద్దూరు మండలకేంద్రంలోని రియల్ ఎస్టేట్ వెంచర్‌ను రాధిక పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతు భరోసా పథకం కోసం రియల్ ఎస్టేట్, మైనింగ్, పరిశ్రమలు ఏర్పాటు చేసిన భూములతోపాటు రాళ్లు, రప్పలు, కొండలుగా ఉన్న భూములను ప్రభుత్వం పరిగణలోకి తీసుకోదని తెలిపారు. ఈనెల 20వ తేదీలోగా అన్ని గ్రామాల్లో అధికారులు సాగుకు యోగం కాని భూములను పరిశీలించి, ప్రభుత్వానికి నివేదించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మద్దూరు తహసీల్దార్ ఏజీ రహీం, ఏవో రామకృష్ణ, ఆర్ఐ రమేశ్, ఏఈవోలు రాజు, అఖిల్, కల్పన ఉన్నారు.

సాగు భూములకే రైతుభరోసా

గ్రామాల్లో సాగుకు యోగ్యం కాని భూములను గుర్తిస్తున్న అధికారులు

గజ్వేల్, జనవరి 16: మండల పరిధిలోని జాలిగామ, దాచారం, సింగాటం, శేర్‌పల్లి గ్రామాల్లో రెవెన్యూ, వ్యవసాయాధికారులు సాగుకు యోగ్యం కాని భూములను గుర్తించేందుకు గురువారం సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి నాగరాజు మాట్లాడుతూ.. భూభారతి పోర్టర్‌లో నమోదై వ్యవసాయానికి యోగ్యమైన భూమికి మాత్రమే రైతుభరోసా ఎకరాకు ప్రభుత్వం రూ.12వేలు అందిస్తుందన్నారు. వ్యవసాయానికి యోగ్యం కాని ఇండ్లు లేదా కాలనీలుగా మారిన అన్ని రకాల భూములు, రియల్ ఎస్టేట్, లే అవుట్, రోడ్లుగా మారిన భూములు, పరిశ్రమలకు, గోదాంలకు, మైనింగ్‌కు వినియోగిస్తున్న భూములు ప్రభుత్వం సేకరించిన అన్ని రకాల భూములు, రాళ్లు, గుట్టలతో నిండి సాగుకు అనువుగా లేని భూములు గుర్తిస్తామని చెప్పారు. అలాంటి వారికి రైతుభరోసా సాయం అందదన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ కృష్ణ, ఏఈవోలు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న శ్రీనివాస్ రెడ్డి

మిరుదొడ్డి జనవరి 16: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని టీఎస్ 24 టీవీ ఛానల్ ఎండీ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మిరుదొడ్డిలో సంక్రాంతి పర్వదినం, స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని నైపుణ్యం ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు గురువారం నగదు బహుమతితోపాటు మెమొంటోలను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ..విద్యార్థులు, యువతను ప్రోత్సహించడానికి క్రీడలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. క్రీడాకారులు ఓటమి చెందామని నిరుత్సాహ పడకుండా గెలుపు కోసం నిరంతరం కృషి చేయాలని సూచించారు. క్రీడాకారులకు ఎల్లవేళలా అండగా ఉంటానని పేర్కొన్నారు. కార్యక్రమంలో నైపుణ్యం ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడు మొగుళ్ల ఐలయ్య, మాజీ ఎంపీటీసీ గొట్టం బైరయ్య తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు మనం ఫౌండేషన్ చేయూత

చిన్నారులకు ఆర్థిక సాయం అందజేస్తున్న మనం ఫౌండేషన్ సభ్యులు

గజ్వేల్, జనవరి 16: మండల పరిధిలోని బంగ్లావెంకటాపూర్‌లో తల్లి మరణంతో అనాథలుగా మారిన ముగ్గురు చిన్నారులకు మనం ఫౌండేషన్ తరపున గురువారం రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు గొడుగు స్వామి మాట్లాడుతూ చిన్నారుల పరిస్థితి చూసిన ప్రతిఒక్కరూ అయ్యో పాపం అంటూ సాయం చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. చిన్నారులను ఆదుకునేందుకు ప్రతిఒక్కరూ ముందుకురావాలని, స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి కనకయ్య, కోశాధికారి ఆంజనేయులు, సభ్యులు కొండల్‌రెడ్డి, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

బోనమెత్తిన 'మద్దూరు'

బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

మద్దూరు (ధూళిమిట్ట), జనవరి 16: మండల కేంద్రంలో బొడ్రాయి ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ప్రత్యేక పూజలు చేశారు.వార్షికోత్సవానికి చిన్మయ మిషన్ నుంచి స్వామి యజ్ఞానంద స్వామి ముఖ్యఅతిథిగా హాజరై అనుగ్రహభాషణం చేశారు. యజ్ఞానంద స్వామికి గ్రామస్తులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అర్చకులు పార్నంది ఆంజనేయ శర్మ, పానుగంటి తిరుపతయ్య ఆధ్వర్యంలో మహిళలు నీళ్లతో బొడ్రాయికి జలాభిషేకం చేశారు. అనంతరం గ్రామంలోని పోచమ్మ, మహంకాళమ్మ తదితర గ్రామ దేవతలకు డప్పుచప్పుళ్లు, శివసత్తుల పూనకాల మధ్య ఊరేగింపుగా వెళ్లి బోనాలను నైవేద్యంగా సమర్పించారు. బొడ్రాయి వార్షికోత్సవానికి ప్రజలు పెద్దసంఖ్యలో తరలిరావడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడిగా మహేశ్

ములుగు, జనవరి 16: ఎమ్మార్పీఎస్ ములుగు మండలాధ్యక్షుడిగా ఆదాసు మహేశ్‌ను గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి కార్యవర్గ సమావేశంలో ఎంఈఎఫ్ ప్రధాన కార్యదర్శి యాదగిరి, ఎంఈఎఫ్ ఆర్గనైజింగ్ ప్రధాన కార్యదర్శి నాగభూషణం ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మహేశ్, ఉపాధ్యక్షుడిగా రామని మల్లేశ్, ప్రధాన కార్యదర్శిగా ఆశగల్ల సురేశ్, కార్యదర్శిగా కొమ్ము వినోద్‌కుమార్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కొమ్ము నవీన్ కుమార్, బుడిగ మహేశ్, రాజు, యాదగిరి, అశోక్ తదితరులు ఉన్నారు.

బడిలో చేరిన వలస పిల్లలు

సర్వే చేస్తున్న యాదగిరి

వర్గల్, జనవరి 16: రాష్ట్ర వ్యాప్తంగా విద్యాశాఖ నిర్వహిస్తున్న అవుట్ ఆఫ్ స్కూల్ చిల్డ్రన్ సర్వే (ఓఎస్సీ) కార్యక్రమంలో భాగంగా గురువారం సాయంత్రం వర్గల్ క్లస్టర్స్ రిసోర్స్ పర్సన్ దుండిగల్ యాదగిరి ఆధ్వర్యంలో మల్లారెడ్డిపల్లిలో స్వాతి(7) మాధవి(16) కురుమూర్తి(16) ముగ్గురు బడి బయట పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులతో మాట్లాడిన తర్వాత వీరిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. వీరంతా మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నుంచి బతుకుదెరువు కోసం కొన్ని నెలల క్రితం వలస వచ్చినట్టు యాదగిరి తెలిపారు.

ప్రమాదవశాత్తు నీట మునిగి రైతు మృతి

గజ్వేల్, జనవరి 16: ప్రమాదవశాత్తు నీట మునిగి రైతు మృతి చెందిన ఘటన మండలపరిధిలోని అహ్మదీపూర్‌లో గురువారం ఉదయం చోటుచేసుకుంది. సీఐ సైదా తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు చాడా కృష్ణారెడ్డి(54) తన వ్యవసాయ పొలం వద్ద బోరు మోటర్‌ను కూడవెల్లి వాగు నుంచి వేసుకొని సాగు చేసుకుంటున్నాడు. బోరు మోటర్ ద్వారా నీళ్లు రాకపోవడంతో నీటిలోని మోటర్‌ను సరిచేసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందినట్లు సీఐతెలిపారు. మృతుడికి భార్య భాగ్యమ్మ, ఇద్దరు కుమారులున్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నిరాశ్రయుల ఆశ్రమాన్ని సందర్శించిన జడ్జి

నిరాశ్రయులకు బెడ్ షీట్లు అందజేస్తున్న జడ్జి స్వాతిరెడ్డి

సిద్దిపేట టౌన్, జనవరి 16: సీనియర్ సిటిజన్స్ హక్కులు తెలుసుకోవాలని జడ్జి స్వాతి రెడ్డి సూచించారు. సిద్దిపేట నిరాశ్రయుల ఆశ్రమాన్ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా నిరాశ్రయులకు కేరింగ్ హ్యాండ్స్ ట్రస్ట్ సహకారంతో బ్లాంకెట్స్, బెడ్‌షీట్లు పంపిణీ చేశారు. అనంతరం జడ్జి స్వాతిరెడ్డి మాట్లాడుతూ..తల్లిదండ్రులను పట్టించుకోని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. నిరాశ్రయులకు ఎలాంటి సమస్యలు ఉన్నా జిల్లా న్యాయసేవాధికార సంస్థకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో మేనేజర్ రజిత, నిరాశ్రయుల ఆశ్రమ సిబ్బంది తదితరులు ఉన్నారు.

రోడ్డు భద్రతపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలి

రాయపోల్, జనవరి 16: రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని రాయపోల్ ఎస్ఐ విక్కుర్తి రఘుపతి అన్నారు. గురువారం రాయపోల్‌లో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. వాహనాలు నడిపే ప్రతిఒక్కరూ తన ప్రాణాలతోపాటు ఇతరుల ప్రాణాన్ని రక్షించేందుకు రోడ్డు భద్రతా నియమాలు కచ్చితంగా పాటించాలని సూచించారు. ఎవరైనా నిబంధనలు పాటించకుంటే జరిమానాలు విధిస్తామని చెప్పారు. అతివేగంగా, మద్యం తాగి, మొబైల్ మాట్లాడుతూ వాహనాలు నడపొద్దన్నారు. పద్దెనిమిదేండ్లలోపు పిల్లలకు బైక్‌లు ఇవ్వవద్దని, తల్లిదండ్రులు పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. నిబంధనల పట్ల ఎలాంటి అవగాహన లేని పిల్లలు వాహనాలతో రోడ్డెక్కితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. రోడ్డు భద్రతపై అందరికీ అవగాహన ఉంటే ప్రమాదలు జరగవని, వాహనాలు ఉన్న ప్రతిఒక్కరికీ హెల్మెట్ ఉండాలని ఎస్ఐ పేర్కొన్నారు.

చేర్యాలలో..

చేర్యాల, జనవరి 16: ప్రతి వాహనదారుడు రోడ్డు నిబంధనలు పాటించాలని, మద్యం తాగి డ్రైవింగ్ చేయవద్దని ఎస్ఐ నిరేశ్ సూచించారు.. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా మండలంలోని మద్దూరు ఎక్స్ రోడ్డు ముస్త్యాల వద్ద గురువారం ఎస్ఐ సిబ్బందితో కలిసి వాహనదారులు, ప్రయాణికులు, ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్, రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. వాహనం నడిపేటప్పుడు వాహనానికి సంబంధించిన డాక్యుమెంట్లు, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలన్నారు. అనంతరం వాహనదారులు ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు పాటించడం వల్ల కలిగే లాభాలు, వాహన డాక్యుమెంట్లు ఉండే ఓనర్లకు కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు.

బెజ్జంకిలో...

బెజ్జంకి, జనవరి 16: దాచారం గ్రామంలోని వాహనదారులకు జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ట్రాఫిక్ రూల్స్‌పై ఏఎస్ఐ శంకర్‌రావు ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ రూల్స్ పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నాడు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది తదితరులున్నారు.

వాహనదారులకు జైలు, జరిమానా

సిద్దిపేట టౌన్, జనవరి 16: మద్యం తాగి వాహనాలు నడిపిన మందుబాబులకు సిద్దిపేట న్యాయస్థానం జైలు శిక్ష, జరిమానా విధిస్తూ గురువారం తీర్పును వెలువరించింది. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ వివరాల ప్రకారం.. సిద్దిపేట ట్రాఫిక్ సర్కిల్ పరిధిలో పోలీస్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలను నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా మద్యం తాగి వాహనాలు నడుపుతూ 23మంది పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ఎదుట హాజరుపర్చారు. విచారణ జరిపిన న్యాయమూర్తి వారికి రూ.55,500 జరిమానా, ఒక్కరికి మూడు రోజుల జైలు శిక్ష వి